www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 13 ఫిబ్రవరి 2023

5




## కుంగుతున్న రోడ్లు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలు సిసి రోడ్లు కుంగిపోతుం డటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు బీటల వాలి ప్రమాదాలను తలపి స్తున్నాయని కాలనీవాసులు అంటున్నారు. దీంతో రాత్రి వేళల్లో పలువురు ప్రమాదాలకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మారేడుబాక దళిత కాలనీలో కుంగుతున్న రోడ్డు

# ప్రమాదకరంగా రహదారులు

**ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**
**చర్యలు చేపట్టాలని పాలకులకు,**
**అధికారులకు విజ్ఞప్తి**

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఐదేళ్లుగా పూర్తిగా పాడైపోయిన రోడ్లు ప్రమాదపరితంగా ఉండటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం గల ద్రాక్షారామం వెళ్లేందుకు అనేక జిల్లాల నుంచి యాత్రికులు నిత్యం వస్తూ ఉంటారు.


రామచంద్రపురం-ద్రాక్షారామ మెయిన్‌రోడ్డు


వెల్ల-ఆదివారపు పేట మెయిన్‌రోడ్డు

### రామచంద్రపురం-ద్రాక్షారామ ప్రధాన రహదారి దుస్థితి

రామచంద్రాపురం-ద్రాక్షారామ మెయిన్ రోడ్డు పూర్తిగా పాడవడంతో యాత్రికులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు ద్రాక్షారామ మీదుగా యానాం వరకు 27 కిలోమీటర్లు అధ్వానంగా ఉంది. ఐదేళ్లుగా అప్పుడప్పుడు తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడం మినహా రోడ్డు పూర్తిస్థాయిలో వేయకపోవడంతో అధికారులకు, రాజకీయ నాయకులకు ఫిర్యాదులు చేసిన ఫలితం లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని. నిధులు మంజూరు అయ్యాయని పనులు ప్రారంభమవుతున్నాయని చెప్పడం మినహా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కాకపోవడం విశేషం. దీనికి తోడు ఇటీవల అక్కడక్కడ గోతులు పూడ్చారు. ఈ రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు, మరోవైపు రోడ్డంతా పెద్ద గోతులు ఏర్పడడంతో రాత్రి సమయంలో ఈ రోడ్లపై పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

### వెల్ల నుంచి ఆదావారపు పేట వెళ్లే రోడ్డు

అదే విధంగా వెల్ల నుంచి ఆదివారపు పేట వెళ్లే మెయిన్ రోడ్డు సుమారు 7 కిలోమీటర్లు పొడవునా గోతులమయంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది ఈ రోడ్డు వెంబడి లైట్లు లేకపోవడంతో పాటు రోడ్డు పూర్తిగా క్షీణ దశకు చేరుకుంది. వెల్ల నుంచి ఆదివారపు పేట ద్రాక్షారామ వెళ్లే వారికి ఇది దగ్గర దారి కావడంతో దీనిని ఉపయోగిస్తారు. అయితే ఈ రోడ్డుపై ఇటీవల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి ఈ రోడ్డును ఆధునికీకరిస్తారని పరిసర గ్రామాల ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. దీంతోపాటుగా కె.గంగవరం మండలంలోని ఎర్ర పోతవరం, శివల, దంగేరు మెయిన్ రోడ్డు గత పది ఏళ్లగా అధ్వానంగా ఉంది. రోడ్డును ఆధునికీకరించాలని పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి మెయిన్ రోడ్లను నిర్మించాలని కోరుతున్నారు.

# సమస్యల వలయంలో రెల్లి కాలనీ

**ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం డిమాండ్**

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మురమళ్ల గ్రామం పంచాయతీ పరిధిలో ఉన్న రాఘవేంద్ర వారధి -పుష్కరాల రేవు వద్ద రెల్లి కాలనీలో పలు సమస్యలతో కాలనీవాసులు సతమతమవుతున్నారు. సమస్యలను తెలుసుకునేందుకు జిల్లా సిపిఎం బృందం, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు ఈ కాలనీలో పర్యటించారు.


సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

### పంచాయతీ కార్మికులుగా సేవలు అందిందించినా ..

ఐ.పోలవరం మండలం మురమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో పుష్కరాల రేవు వద్ద ఎస్‌సి రెల్లి కులస్తులు 1986 నుంచి మురమళ్ల గ్రామ పంచాయతీలో పనిచేస్తూ జీవనోపాధి గడుపుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిదులు రాజకీయాలు చేసి పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న వీళ్లని 2014లో తొలగించారు. అప్పటి నుంచి అధికారులు ఎవరూ వారి సమస్యలను పట్టించుకోవడం లేదు. అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా కలెక్టర్ వీళ్లని విదుల్లోకి తీసుకోమని ఆర్డర్ కూడా ఇచ్చారు. కాని మమ్మల్ని అప్పటి స్థానిక సర్పంచ్ విధుల్లోకి తీసుకోకుండా అడ్డుకున్నారని రెల్లి కులస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

### మాణిక్యాలమ్మకు అందని రేషన్

ఇటీవల ఆరు నెలలుగా రేషన్ అందడం లేదని తుపాకుల మాణిక్యాలమ్మా ఆవేదన చేసింది. ఈ విషయం ప్రతికలలో వచ్చింది దీంతో వారి సమస్యలు తెలుసుకోవడానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సిపిఎం బందం, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అక్కడకు వెళ్లారు.
ఈ సందర్భంగా బంగారు ధనలక్ష్మి, కాకి తలుపులమ్మ నిమ్మకాయల మహలక్ష్మి, తుపాకుల మాణిక్యాలమ్మ కుటుంబాలు నుంచి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### పంచాయతీ కార్మికులుగా విధుల్లోకి తీసుకోవాలి

ఈసందర్బంగా కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బంగారు ధనలక్ష్మి, కాకి తలుపులమ్మ. నిమ్మకాయల మహలక్ష్మి, తుపాకుల మాణిక్యాలమ్మలను తక్షణం పంచాయతీ కార్మికులుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూమారు 30 సంవత్సరాలు చాలీచాలని జీతాలతో పంచాయతీ కార్మికులుగా వెట్టి చాకిరీ చేసిన వారిని విధుల్లోంచి తొలగించడం అన్యామన్నారు ఈ కుటుంబాలు చాలా దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని, నిలువ నీడలేక పిల్లలతో ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు ప్రభుత్వం ఈరెల్లి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీరి సమస్యలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు ఈకుటుంబాలకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారతదేశం ఇంకా వెనకబడిఉంది అనడానికి ఈ రెల్లి కుటుంబాలే ఉదాహరణ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తుపాకుల మాణజక్యాలమ్మకు ఆరునెలలగా రేషన్ అందడం లేదని అదికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని కారెం వెంకటేశ్వరరావు అన్నారు. రెవెన్యూ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్ధమౌతోందని అన్నారు. తుపాకుల మాణిక్యాలమ్మకు తక్షణం ఆరునెలల రేషన్ బియ్యం ఇప్పంచాలనీ నిర్లక్యంగా వ్యవహరించిన అదికారులపై చర్యలు తీసుకోవాలని కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యాదర్శి జి.దుర్గాప్రసాద్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గుడిసెలు ఏర్పాటుచేసుకుని నివసిస్తున్న కాలనీవాసులు, రహదారులు లేని కాలనీ

# మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

**గోడి పాఠశాల్లో సమస్యలు పరిష్కరించాలి**
**సిపిఎం జిల్లా కమిటీ**

ప్రజాశక్తి-అమలాపురం

గోడి సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేసింది. అల్లవరం మండలం గోడి సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల్లో 6వ తరగతి చదువుతున్న పల్లంకుర్రుకు చెందిన మోర్త సోహిత్ రాజవర్ధన్ గురుకుల పాఠశాల్లో దుర్భరమైన పరిస్థితుల వల్లే తట్టుకోలేక తన స్వగృహంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఈ గురుకుల పాఠశాలను సమస్యలు వేధిస్తున్నాయని ప్రజాప్రతినిధులకు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన రాలేదని, ఇప్పటికైనాచర్యలు తీసుకోవాలన్నారు. పేద విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వేలాది మంది పేద విద్యార్థులు చదువుతున్న గురుకుల పాఠశాలలకు సౌకర్యాలు కల్పించడంలోనూ, నాణ్యమైన విద్య, ఆహారం అందించడంలోనూ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. దీనికి గోడి గురుకుల పాఠశాల నిదర్శనమని అన్నారు. ఆక్వా హేచరీ డ్రైనేజీ వ్యర్థాలు కలుస్తున్న కాలువ నీరు స్నానానికి ఉపయోగించడం వల్ల విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంలో 6వ తరగతి చదువుతున్న రాజవర్ధన్ పాఠశాల్లో సమస్యలు వేధించడం వల్లనే తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాయన్నారు. ఈప్రకటన విడుదల చేసినవారిలో జిల్లా కమిటి సభ్యులు జి. దుర్గా ప్రసాద్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ పి.వసంతకుమార్ ఉన్నారు.


కారెంవెంకటేశ్వరరావు

### 'నవోదయ' ప్రవేశానికి గణితం కీలకం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

నవోదయ ప్రవేశ పరీక్షకు అర్హత సాధించాలంటే గణితం కీలకమని ఉపాధ్యాయుడు శ్యామ్ జాదూగర్ చింత శ్యామ్ అన్నారు. ఆదివారం ర్యాలి స్థానిక మ్యాజిక్ హౌస్ లో శ్యామ్ జాదూగర్ మాయ ఇ బడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవోదయ ఉచిత శిక్షణ తరగతుల్లో చిన్నారులకు గణితంలో పట్టుసాడించటానికి చేతివేళ్ల తో సులువుగా ఎక్కాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ నవోదయ లో సీటు సాధించాలంటే గణితం చాలా కీలకమని విద్యార్థులు కచ్చితత్వం, వేగవంతం పై దృష్టి సారించాలని సూచించారు.

# బాధితుల పట్ల సానుభూతి చూపాలి

**ఎపి హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు**

ప్రజాశక్తి-అమలాపురం

న్యాయమూర్తులు, న్యాయవాదులు బాధితులు పట్ల సానుభూతి చూపాలని ఎపి హైకోర్టు జడ్జి తల్లాప్రగడ మల్లికార్జునరావు అన్నారు. అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోషియేషన్ అధ్యక్షులు మాకిరెడ్డి ఆదినారాయణరావు అధ్యక్షతన ఆదివారం మల్లికార్జున రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ నేదునూరు గ్రామానికి చెందిన మల్లికార్జున రావు అమలాపురం బార్ మెంబర్ గా ఉండి హైకోర్టు జడ్జి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. మల్లికార్జున్ రావు ను ఆదర్శంగా తీసుకుని న్యాయవాదులు పనిచేయాలని పలువురు అన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు బాధితులు పట్ల సానుభూతి చూపాలని వారెన్నో ఆశలతో న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కుతారని వారికి న్యాయం జరిగేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి తూర్పుగోదావరి జిల్లా పోర్ట్ పోలియో జడ్జి డివి.సోమయాజులు, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జ్యుడిషియల్ ప్రివ్యూ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ డాక్టర్ బులుసు శివ శంకర్రావు, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులైన కూచిమంచి మళ్లపరాజు, డి.బి.లోక్, కుడిపూడి సూర్యనారాయణ రావు, ఎండి ఆజాద్, ఎవిఎస్. ప్రసాద్, పెయ్యల సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ సంసాని శ్రీనివాస్ అనిల్, వైస్ ప్రెసిడెంట్ నేరేడుమిల్లి మల్లికార్జునరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొని హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎస్‌సి, ఎస్‌టి జడ్జి నాగేశ్వరరావు, అమలాపురం రెండవ అదనపు జిల్లా జడ్జి వి.నరేష్, సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు , స్పెషల్ మెజిస్ట్రేట్ ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్, రాజోలు, కొత్తపేట, ముమ్మిడివరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జ్ మల్లికార్జున రావును సన్మానం

### చంద్రబాబు పర్యటన విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-రాజోలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే జాతీయ టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం రాజోలు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటరమణ మాట్లాడారు. ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చంద్రబాబు వస్తారని అన్నారు. మూడు రోజుల పాటు చంద్రబాబు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని అన్నారు. 17న రాత్రి 9.30గంటలకు తిరిగి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు

# ముగిసిన జిల్లా రెవెన్యూ క్రికెట్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి -అమలాపురం

జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులకు గత వారం రోజుల నుంచి నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. క్రీడలే ఉద్యోగ ఒత్తిడిని తగ్గించి ఉద్యోగుల్లో స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడి కొత్త జిల్లా లో నూతన ఉత్సహం తో విధులు నిర్వహిస్తారని సదుద్దేశంతో జిల్లా కలెక్టర్ జిల్లా సంయుక్త కలెక్టర్ సహకారంతో రెవెన్యూ ఉద్యోగులు 5 క్రికెట్ జట్లగా ఏర్పడి ఈ లీగ్ విజయవంతం గా ముగిసింది. సుమారు 80 మంది ఉద్యోగులు పాల్గొన్న ఈ పోటీలను స్థానిక కిమ్స్ అమలాపురం గ్రౌండ్ లో నిర్వహించారు. ప్రతిభ చూపిన ఆటగాళ్లకు ఫైనల్ పోరులో పాల్గొన్న కెప్టెన్ హరి, కెప్టెన్ కిషోర్ జట్లకు జిల్లా రెవెన్యూ అధికారి ట్రోఫీ లు అందచేశారు. ఈ లీగ్ నిర్వహించడానికి సహకరించిన జిల్లా కలెక్టర్‌కి, జాయింట్ కలెక్టర్‌కి, జిల్లా రెవెన్యూ అధికారికి, కిమ్స్ గ్రౌండ్ పీడీ తదితరులకు ఉద్యోగులు ధన్యవాదాలు తెలియజేశారు.


ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

# బాలబాలాజీ అన్నదాన నిధికి విరాళాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం శాశ్వత అన్నదాన నిధికి ఆదివారం దాతలు విరాళం అందజేశారు. కాకినాడ విశ్వ వింగ్స్ ఓవర్ సీస్ కంపెనీ వారి కుమారుడు దిగుమర్తి తత్వ షణ్ముఖ్ పుట్టినరోజుకు ప్రతి ఏటా జూన్ 12 న అన్నదానం జరిపించేందుకు ఆదివారం రూ.లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఇఒ ఎమ్.లక్ష్మీ నారాయణ తెలిపారు. హైదరాబాదు వాసులు గుబ్బల నాగేశ్వరరావు వీర వెంకట సత్య నారాయణమ్మ దంపతులు కుమారుడు చి.గంగాధర్ నాగ సాయి పుట్టినరోజు ఫిబ్రవరి 10న అన్నదానం నిర్వహించేందుకు రూ.10,116, భద్రాచలం స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ పూర్వ ఉద్యోగుల సంఘం బాలబాలాజీ స్వామి కళ్యాణం రోజున అన్నదానం నిర్వహించేందుకు రూ.10 వేలు, విజయవాడ వాసులు పిసుపాటి వెంకట శేష రవి కుమారుడు అఖిలేష శాస్త్రి పుట్టినరోజు ఫిబ్రవరి 18న అన్నదానం నిర్వహించేందుకు రూ.10 వేలు విరాళాలు ఇచ్చారన్నారు. దాతలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకష్ణ స్వామివారి చిత్రపటాలు, ప్రసాదములు అందజేశారు.


చిత్రపటం అందుకుంటున్న దాతలు

### ఇసుక రీచ్‌లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -ఆత్రేయపురం

. మండలం పరిధిలో నోటిఫై చేసిన ఇసుక్ రీచ్ లలో తవ్వకాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని మెర్లపాలెం గ్రామ సర్పంచ్ మెర్ల రాము డిమాండ్ చేశారు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని 17 గ్రామాల్లో ఇసుక అందుబాటులో లేక గృహనిర్మాణ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండల పరిధిలో 18 కి.మీ మేర వశిష్ట గోదావరి, 18 కి.మీ మేర గౌతమి గోదావరి నదులు ప్రవహిస్తు వున్నప్పటికీ మైనింగ్ అధికారులు, జిల్లా ఇసుక కమిటీ మండల పరిధిలో ఒక్క ఇసుక రీచ్ మంజూరు చేయకపోవడం అధికారయంత్రాంగం అలసత్వానికి నిదర్శనమని అన్నారు. మండల గ్రామాల ప్రజలు ఇసుక అవసరాల కోసం రావులపాలెం మండలం లోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక కొనుగోలు చేసే దుస్థితి ఏర్పడిందని ఆయన అవేదన వ్యక్తం చేశారు. గోదావరి నదుల్లో వరద ప్రవాహం తగ్గి 4 నెలలు కావస్తున్నా.. ఇప్పటివరకు మండల పరిధిలో ఇసుక రీచ్ లు మంజూరు చేయకపోడం శోచనీయమని అన్నారు గ్రామాల చెంతని ఇసుక అందుబాటులో ఉన్న అధిక రవాణాచార్జీలు చెల్లించి ఇసుక తెచ్చుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు కృత్రిమ కొరత సృష్టించి ఇసుకను అధిక రేట్లు అమ్ముతున్నారు దీనిపై అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే మండలంలో ఇసుక రీచ్ లకు అనుమతులు మంజూరు చేసి గృహ నిర్మాణదారులకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కార్టూ'నిజం'






అమలాపురంలో ఎన్నికైన మెడికల్, సేల్ రిప్రజెంటేటివ్ నూతన కార్యవర్గం


ఐ.పోలవరం మండల బిఎస్‌ఐ మండల కమిటీ

# నూతన కార్యవర్గాల ఎన్నిక

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల నూతన కార్యవర్గాల ఎన్నిక ఆదివారం నిర్వహించారు. వివరాలు ఇవి..

### మెడికల్, సేల్ రిప్రజెంటేటివ్ కార్యవర్గం

**అమలాపురం** మెడికల్ అండ్ సేల్ రిప్రజెంటేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం అమలాపురం యుటిఎఫ్ హోమ్ నందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శిరీష్ కుమార్, సిఐటియూ కార్యదర్శి బలరాం ముఖ్య అతిథిగా విచ్చేసి అధ్యక్షత వహించారు. కార్యక్రమం లో కార్మికులపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టి వారికి సామాజిక భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26000 అమలుచేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. తదనంతరం కమిటీని ఎన్నుకున్నారు. అమలాపురం మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్, అమలాపురం శాఖ అధ్యక్షునిగా శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ పోలేశ్వరరావు, రమేష్, సెక్రటరీ వీరాంజనేయ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ దుర్గా బాపిరాజు, ప్రసాద్, ట్రెజరర్ సంతోష్ సభ్యులుగా కేశవరావు, సాగర్, సురేష్, సాజిద్, సూర్యనారాయణ, కొండబాబు,జయరాం,గంగాధర్ ఎన్నికయ్యారు.

### బిఎస్ ఐ నూతన మండల కమిటీ ఎన్నిక

**ఐ.పోలవరం** మండల కేంద్రంలో ఉన్న ఎస్‌సి కమ్యూనిటీ హాలులో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు మట్టా సిద్ధార్ధ గౌతమ్ ఆధ్వర్యంలో గౌరవాఅధ్యక్షులు ఉపాసక పండు బుల్లబ్బాయి అధ్యక్షతన నూతన మండల కమిటీ ఎ న్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షులు వరసాల లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షులు యలమంచిలి సురేష్, కార్యదర్శి ములపర్తి కాంతారావు, సహాయ కార్యదర్శి పంతగడ అప్పారావు, కోశాధికారి కాశి మహేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోర్త ధనకాసులు, దాకే శ్రీరామ చంద్రమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జగడం వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి కాశి వెంకట రమణ, ట్రెజరర్ సఖిలే పద్వీరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇవివి. సత్యనారాయణ, మోకా కష్ణ మూర్తి, బిఎస్ఐ అమలాపురం మండల శాఖ కార్యదర్శి దడాల రాజశేఖర్,రేవు యజ్ఞశ్రీ, ఐ.పోలవరం అంబేద్కర్ యువజన సంఘ మండల అధ్యక్షులు సాదే రాజేష్ పాల్గొన్నారు.


రాజేష్‌కు సాయం అందజేస్తున్న జెడ్‌పి స్కూల్ పూర్వ విద్యార్థులు

### స్నేహితునికి పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి-రాజోలు

అనారోగ్యంతో ఉన్న స్నేహితునికి పొన్నమండ రామకృష్ణా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. 1996 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఈ ఏడాదిలో గేట్ టు గెదర్ కార్యక్రమానికి ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ బ్యాచ్ లో కొల్లాబత్తుల రాజేష్ అరోగ్య పరిస్థితి బాగోలేదు. ఈ విషయం తెలియడంతో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం నిర్వహణకు దాదాపు రూ.70వేలు వరకు ఖర్చు అవుతుందనే అంచనా.. అదే సొమ్మును రాజేష్‌ఖు అందజేస్తామని తన మిత్రులతో రవి చెప్పారు. వారంతా తక్షణమే స్పందించి తమ వంతుగా రూ.70 వేల నగదును సేకరించి రాజేష్ కు అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులకు రాజేష్ కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంజ్యం రవి, బళ్ళ గణపతి, ఉండ్రు బాలకృష్ణ, వాసాల నాగరాజు పలువురు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ అమలు

## ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ






ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని జిల్లాలో అర్హులందరికీ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ పసుపులేటి రాధాకష్ణ అన్నారు. ఈ పథకం కింద జిల్లాలో నిర్వహించిన నవశకం సర్వేలో 16,13,000 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. వీరిలో మొదటి విడతలో 5,882 ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశామన్నారు. జనవరి 3వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గతంలో 1,059 జబ్బుల నుంచి 1,259 రోగాలకు వైద్యసేవలు అందించనున్నామన్నారు. జనవరి 3 తేదీ నుంచి పెంచిన జబ్బులకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

**ఆరోగ్యశ్రీకి కొత్తగా చేర్చిన ముఖ్యమైన సేవలు ఏమిటి.**

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కంటికి, చెవికి, ముక్కు, గొంతుక, పీడియాట్రిక్, జెనిటో న్యూరో, సర్జికల్, అంకాలజీ, మెడికల్ అంకాలజీకి సంబంధించిన జబ్బులను ఆరోగ్యశ్రీలో కొత్తగా చేర్చారు.

**పాత కార్డులు కూడా చెల్లుతాయా.**

ప్రభుత్వం కొత్త కార్డులను జారీ చేస్తోంది. కొత్త కార్డులు ఇచ్చే వరకూ పాత కార్డులు చెల్లుబాటులో ఉంటాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందుతాయి. నవశకం సర్వే ఆధారంగా లబ్ధిదారులను గుర్తించాము. అర్హుల జాబితా ఇప్పటికే గ్రామ,వార్డు సచివాలయాల్లో ప్రకటించారు.

**ఇతర ఏయే రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీని విస్తరించారు.**

ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు ఇక మన రాష్ట్రంతో బాటు, ఇతర రాష్ట్రల్లో కూడా వైద్య సేవలు పొందవచ్చు. కర్నాటక, తమిళనాడు తెలంగాణా వంటి రాష్ట్రాలతో కలిపి 135 కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం పొందవచ్చు. ఇతర రాష్ట్రాల్లో 130 కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది. జిల్లాలో 85 ప్రభుత్వాసుపత్రులు, 86 ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు పొందవచ్చు.

**మొత్తం ఎన్ని శస్త్రచికిత్సలు చేశారు..**

ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 4,91,833 ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేశారు. వీటికి ప్రభుత్వం నుంచి రూ.1,280.26 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 3,429 హెల్త్ క్యాంపులు నిర్వహించారు. వీటిద్వారా 6,62,578 మంది ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 16,838 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రెఫర్ చేశారు

**వైయస్సార్ ఆసరా ప్రయోజనాలేమిటి..**

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం శస్త్ర చికిత్సలు చేకున్న వారికి వైఎస్ఆర్ ఆసరా క్రింత పోషణ ఖర్చుల కోసం రూ.225 నుంచి రూ.5 వేల వరకు ఆర్థిక సాయం ప్రభుత్వం నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఆరోగ్యశ్రీ పథకంలో రోగులకు డాక్టర్ల వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు (రక్తపరీక్షలు) శస్త్ర చికిత్సలు, ఉచితంగా మందులు పంపిణీ, ఉచిత భోజనం, వసతి, ఆసుపత్రులు రానుపోను రవాణా ఖర్చులు ఇవ్వనున్నారు.

## నేరాలు ఘోరాలు


అధికారులుస్వాధీనం చేసుకున్న పిడిఎస్ బియ్యం

## రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని సత్యవాడ-నరజాడ రోడ్డులో వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం లో పిడిఎస్ బియ్యం తరలిస్తారన్న సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ. సివిల్ సప్లయి అధికారులు తనిఖీ చేశారు. వాహనంలో వివిధ రంగుల 43 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పిడిఎస్ బియ్యాన్ని ఎటువంటి బిల్లులు లేకుండా కె. గంగవరం మండలం సత్యవాడ గ్రామమ నుంచి యానాం ప్రాంతానికి డ్రైవర్ చవ్వాకుల వెంకటేశ్వరరావు తరలిస్తున్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.6,80,000లు ఉంటుందని అంచనా. మొత్తం 20.00 క్వింటాళ్ల రేషన్ బియ్యం సివిల్ సప్లయ్స్ అధికారులు సీజ్ చేసి 6-ఎ కింద కేసు, తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇనెస్పెక్టర్లు రమేష్, తహశీల్దార్ విజయకుమార్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ ఈశ్వర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.


బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

## ఇటుక ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఏటిగట్టుపై వెళుతున్న ఇటుక ట్రాక్టర్ ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇవి. కోటిపల్లి ఏటిగట్టు నుంచి వెళుతున్న ట్రాక్టర్ నీలగిరి పేట వద్ద గేదెను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న నీలా నాగేశ్వర రావు ( 52 ) మతి చెందాడు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

## బస్సు ఢీ కొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- రామచంద్రపురం

రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ లో ఆర్టీసీ బస్ ఢీ కొని వ్యక్తి ఆదివారం దుర్మరణం పాలయ్యాడు. పట్టణానికి చెందిన టేకుమూడి సత్యనారాయణ (50) మోటార్ సైకిల్ పై చోడవరం వైపు వెళుతుండగా కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి బస్సు ఢీ కొంది దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న సత్యనారాయణ అక్కడకక్కడే మతి చెందాడు.రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి -రామచంద్రపురం

అగ్ని ప్రమాదానికి గురైన మహిళచికిత్స పొందుతూ మృతి చెందింది. మండలం లోని శివల గ్రామానికి చెందిన నిడదవోలు లక్ష్మీ భ్రమరాంబ ఇటీవల నీళ్ల కాస్తూ అగ్ని ప్రమాదానికి గురైంది. ఆమె కాకినాడ ప్రభు త్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ చిరంజీవి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యానికి డబ్బులివ్వలేదని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతానగరం

భార్య మద్యానికి డబ్బులివ్వలేదని పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మునికూడలి గ్రామానికి చెందిన గెడ్డం యేసు (23) మద్యానికి బానిసై సంవత్సరం నుంచి పనికి వెళ్లకుండా ఇంటివద్ద ఉంటున్నాడు. శనివారం మద్యం తాగడం కోసం భార్య డబ్బులు ఇవ్వడం లేదని చుట్టు పక్కల పొలాల్లో రైతులు దాచుకున్న పురుగుల మందు తాగి ఇంటికెళ్లాటు. వాంతులు కావడంతో భార్యతో పురుగులు మందు తాగినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం రాజమండ్రి ప్రభుతాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తాళ్లరేవులో ఎన్నికల కోడ్ అమలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంఎల్సి ఎన్నికల సందర్భంగా అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో శాసనమండలికి ఎన్నికైన చిక్కాల రామచంద్రరావు పదవీకాలం ఈ ఏడాది మే1తో ముగియనుంది. ఈ స్థానంలో ఎన్నిక కోసం గురువారం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి విదితమే. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఈనెల 23 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 24న నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుంది. 27 వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువుగా పేర్కొన్నారు. మార్చి 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 16న ఎన్నికల ఓట్లు కౌంటింగ్ జరుగుతుంది. మార్చి 21తో ఎన్నికల నోటిఫికేషన్ పూర్తవుతుంది .అప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది.

## వైద్యశిబిరం నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - కడియం

పుట్టిన రోజును పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య అట్టహాసంగా నిర్వహించుకోకుండా ఉచిత వైద్య శిబిరం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం వేమగిరిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత రావిపాటి రామచంద్రరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కిమ్స్, బొల్లినేని వైద్యులు, అకిరా నేత్ర వైద్యులు ఈ వైద్య శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. వైద్యపరీక్షలను నిర్వహించామని శస్త్రచికత్సలు అవసరమైన వారికి తమ ఉచితంగ చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, భీమిరెడ్డి నాగేంద్ర, ఈలి గోపాలం పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - పెద్దాపురం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెద్దాపురం లూథరన్ హైస్కూల్లో 1982లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 41 సంవత్సరాల అనంతరం ఆదివారం లూథరన్ హైస్కూల్లో కలుసు కున్నారు. తమ విద్యార్థి దశలో జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎక్కడెక్కడో స్థిరపడిపోయిన తాము 40 ఏళ్ల క్రితం తాము చదువుకున్న స్కూల్లో కలుసుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కట్టా వెంకటరావు, తిప్పాని శ్రీనివాస్, శంకర్, పైడిపల్లి సూర్యనారాయణ మూర్తి, వేదుల సుబ్రహ్మణ్యం (మణి), రియాజ్ పాషా పాల్గొన్నారు.

## హైవేను గ్రామం వెలుపలకు మళ్లించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వెళ్లే నేషనల్ హైవేను దొండపూడి గ్రామం బయట నుంచి మళ్లించాలని ఆ గ్రామానికి చెందిన వైసిపి మండల అధ్యక్షులు పోతిరెడ్డి నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు పోల్నాటి సురేష్, గ్రామ పెద్దలు ఎంపీ మార్గాన్ని భరత్, ఎంఎల్ఎ తలారి వెంకట్రావులకు వినతిపత్రాలు అందించారు. ఎంపీ, ఎంఎల్ఎలను వారు ఆదివారం కలిశారు. వారు మాట్లాడుతూ జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వెళ్లే నేషనల్ హైవే రోడ్డు మండలంలోని దొండపూడి గ్రామం శివారు సాగిపాడు నుంచి దొండపూడి శివారు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర వెళ్లనుందన్నారు. ఈ రహదారిని గ్రామంలో నుంచి వేస్తున్నారన్నారు. దీని వల్ల దొండపూడి గ్రామంలో చాలామంది నివాసాలను కోల్పోతారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని దొండపూడి గ్రామం దాటే వరకు సుమారు రెండు కిలోమీటర్లు బైపాస్ రోడ్డు వేయలని కోరినట్లు తెలిపారు.


చిన్నారులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీ దుర్గ, వెంకన్న నాయుడు

## చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లిలో హెచ్ఐవి బాధిత చిన్నారులకు ఆదివారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, వైసిపి నాయకులు వంటెద్దు వెంకయ్య నాయుడు, కె.రిష్విక్, కె. ప్రసన్న, జి.చంద్రశేఖర్, జల్లి సుజాత, కె.ధీరజ్‌ల సహకారంతో ఈ కిట్లు అందజేశారు. ముందుగా చిన్నారులతో కేక్ కటింగ్ చేయించి వారిలో మనో ధైర్యం నింపారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, నాయకులు మద్దింశెట్టి సీతారామస్వామి, సలాది శివాజీ, సలాది పట్టాభి, దూలం శ్రీనివాసరావు, సుంకర బుజ్జి, చప్పిడి దుర్గారావు, పోలిశెట్టి వీరబాబు, నందుల ఏసుబాబు, సలాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -యంత్రాగం

పలుచోట్ల ఆదివారం పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. నగదును స్వాధీనం చేసుకుని పలువురిని అరెస్ట్‌చేశారు. వివరాలు ఇవి..

**మండపేట**మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లిలోని పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,32,700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.శివకష్ణ తెలిపారు. **సామర్లకోట** స్థానిక సంపంగి తోటలోని పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,360 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ఇటీవల కూనవరానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్త కొప్పిశెట్టి రామస్వామి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఆదివారం జనసేన పార్టీ రూ.20 వేల ఆర్థిక సాయం అందించింది. అలాగే గోపవరం కు చెందిన నాగాబత్తుల ప్రసాద్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా ఆ కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఉండ్రు భగవాన్ దాస్,ఆకుల సూర్యనారాయణ మూర్తి, లింగోలు పండు,సాకా రాంబాబు, అయితాబాత్తుల కష్ణారావు, కొప్పుల నాగమానస, బసవా చినబాబు, గాలి నారాయుడ ు,తిక్కా శేషబాబు, వాకపల్లి వెంకటేశ్వర రావు, ఆకుల శ్రీనివాసరావు,బండారు వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులుగా రహదారులు, కాలువగట్లు

**దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

ప్రజాశక్తి -మండపేట


బైపాస్ రోడ్డులో పేరుకు పోయిన చెత్తా చెదారం

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, మనం-మన పరిశుభ్రత, వ్యర్థాలపై వ్యతిరేక పోరాటంతోపాటు పారిశుధ్యంపై అవగాహన వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మెరుగుపడటం లేదు. సమస్య నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది. ఆహ్లాదకంగా ఉండాల్సిన రహదారులు, కాలువ గట్లు డంపింగ్‌యార్డులుగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో తాము వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇవి కుక్కలకు, పందులకు, దోమలు, క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారుతుండటంతో రాత్రి సమయాల్లో దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. స్థానిక బైపాస్, ఇందిరాగాంధీ రోడ్డులతో పాటు మండలంలోని వెలగతోడు, తాపేశ్వరం, అర్తమూరు తదితర గ్రామాల్లో రోడ్ల, కాలువల వెంబడి ఉన్న చెత్తాచెదారాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. స్థానిక పెద్ద కాలువ వంతెన సమీపంలోను రహదారి వెంబడి చెత్తను వేయడంతోపాటు ఆ చెత్తకు నిప్పు పెడుతుండటంతో ఆ రోడ్లపై ప్రయాణించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. మూతపడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తెరిచి, చెత్తను అక్కడికి తరలించాలని కోరుతున్నారు. పచ్చదనం, పరిశుభ్రతను కాపాడే విధంగా అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


పెద్ద కాలువ వంతెన సమీపంలో చెత్త


రాజరత్న రోడ్డులో పేరుకుపోయిన చెత్త


కార్యక్రమం లో పాల్గొన్న టిడిపినాయకులు

## కాకరపర్రులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి మండలంలోని కాకరపర్రులో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఆదేశాలతో ఆదివారం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరిగి జగన్ ప్రభుత్వం పేదలపై వేస్తున్న భారాలను వివరించారు. కరెంటు బిల్లులు, ఆర్‌టిసి ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ పెట్రోలు డీజిల్ వంట నూనె ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపైభారం మోపారని చెప్పారు. అనంతరం నాయకులు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అతికాల వెంకట రామకష్ణమ్మ, సంగీత జయరాజు, బొడ్డు రామాంజనేయులు, అబ్బిశెట్టి సత్తిరాజు, వాకలపూడి వీర్రాజు, సలాది కష్ణమూర్తి, గుడాల నాగ మురళీకృష్ణ, మాణికిరెడ్డి, మురళీకష్ణ, బూరుగుపల్లి, నారాయణరావు, అనపర్తి సత్యనారాయణ, అనపర్తి సాంబమూర్తి, కంటిపూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి రిమాండ్

ప్రజాశక్తి-సామర్లకోట

జి.రాగంపేట అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్స్‌లో ఏడుగురు కార్మికుల మరణం ఘటనలో ముగ్గురు నిందితులను ఆదివారం పెద్దాపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. వారికి ఆయన 14 రోజుల రిమాండ్ విధించారు. వారిని పెద్దాపురం సబ్ జైలుకు తరలించినట్లు పెద్దాపురం పోలీసులు తెలిపారు.

## 16న పెద్దాపురంలో చంద్రబాబు పర్యటన


ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా 16న పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని జె.తిమ్మాపురం గ్రామంలో ప్రవేశిస్తారని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. జె.తిమ్మాపురంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులు కార్యకర్తలు ఆయనకు భారీ స్వాగతం పలుకుతారన్నారు. పర్యటనలో భాగంగా కట్టమూరు సెంటర్‌కు చేరుకుంటారని, అక్కడ కట్టమూరు గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలుకుతారన్నారు. సాయంత్రం 5 గంటలకు పెద్దాపురం కొత్తపేట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పట్టణ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలుకుతారన్నారు. అనంతరం దర్గా సెంటర్, వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా సామర్లకోట చేరుకుంటారన్నారు.

## స్కూల్ గేమ్స్ పోటీల్లో సునయన సత్తా

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కాకినాడ విద్యార్థిని పిఎస్ఆర్ఎస్.దీప్తి సునయన మరోసారి సత్తా చాటింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పతకం సాధించింది. అండర్ 17 బాలికల 400 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈత పోటీల్లో కాంస్య పతకం గెలిచింది. 100 మీటర్ల విభాగంలోనూ తృతీయ స్థానంలో నిలిచి, పతకం సాధించింది. కష్ణా జిల్లా ఈడ్పుగల్లులో జరిగిన పోటీల్లో సునయన విజయం సాధించడం జిల్లాకు గర్వకారణమని డైవ్ ఇన్ స్విమ్ కోచ్ అశోక్ అన్నారు. సెయింట్ జోసెఫ్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న ఆమె విజయం సాధిస్తుండడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు శివ ప్రసాద్ వర్మ, అర్చన సంతోషం వ్యక్తం చేశారు.


బషీర్ బీబీని దర్శించుకున్న ఎస్‌పి

## బషీర్ బీబీని దర్శించుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పొన్నాడ గ్రామంలో ఉన్న బషీర్ బేబీ ఆలయాన్ని కాకినాడ జిల్లా ఎస్‌పి రవీంద్రబాబు దర్శించుకున్నారు. ఆదివారం చివర రోజు కావడంతో ఎస్‌పి స్వయంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బీబీని సందర్శించేందుకు రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి అనేకమంది మతాలకు అతీతంగా హాజరవుతారు. ఎస్‌పి వెంట పిఠాపురం సిఐ శ్రీనివాసరావు, కొత్తపల్లి ఎస్సై రామలింగేశ్వరరావు పలువురు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.